ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 | సంచిక : 11 | జూలై 2015

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

23-04-2015

జిన్నూరు

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-04-2015 జిన్నూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శంకరజయంతి. కలియుగంలో శివుడు శంకర రూపంలో వస్తాడని కొన్ని పురాణాలలో వ్రాసి ఉంది. ఆయన పూర్ణానది ప్రక్కన కాలడి అనే గ్రామంలో బ్రాహ్మణ అగ్రహారంలో శరీరం తీసుకొన్నాడు. ఆయన తల్లిగారిపేరు ఆర్యాంబ, తండ్రిగారి పేరు శివగురువు. మూడవ సంవత్సరంలో తండ్రిగారు స్వర్గస్తులు అయ్యారు, ఐదవ సంవత్సరంలో తల్లిగారు ఆయనకు ఉపనయనం చేయించారు. ఆయన ఏడవ సంవత్సరంలో కాలడి దగ్గరలో గురుకులవాసం చేసారు, శాస్త్రం అంతా నేర్చుకొన్నారు. తరువాత తల్లిగారి అనుమతితో సన్యాసం తీసుకొన్నారు. ఆయన జీవితంపొడుగునా ఉపదేశించారు, రచించారు, బోధించారు. భాష్యగ్రంథాలు, స్తోత్రగ్రంథాలు, ప్రకరణగ్రంథాలు వ్రాసారు. ఈరోజున కాలడిలో శరీరం తీసుకున్న మన ఆచార్యుడు 32 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత కేదార్‌లో గుడి వెనకాల ఆయన చేతిలో పెట్టుకొన్న దండాన్ని విడిచిపెట్టి అక్కడనుండి అదృశ్యం అయిపోయారు. అక్కడ సమాధి కట్టారు.

ఆచార్యులవారి ప్రజ్ఞ చాలా విశేషమైనది. ఆయన పండితుడు, కవి, రచయిత, విమర్శకుడు, బోధకుడు. హిందూమతంలో ఉన్న అనాచారాలను తీసేసాడు. ధర్మంగురించి, ఆచారం గురించి జీవితం పొడుగునా బోధించాడు. ఆయన భారతదేశం అంతా కష్టపడి మూడుసార్లు తిరిగి ఆయన నమ్మిన అద్వైతసిద్ధాంతాన్ని ప్రజలకు బోధించారు. మన దేహంయొక్క రంగులువేరు, మనస్సు యొక్క గుణాలు

వేరు. కాని వీటి అన్నింటికి ఆధారంగా మన హృదయాలలో నారాయణుడు అంతర్యామిగా ఉన్నాడు. ఆయన అందరి హృదయాలలోను ఒకటిగానే ఉన్నాడు. సత్యం అనేది ఒకటిగానే ఉంటుంది, రెండుగాగానీ మూడుగాగానీ ఉండదు. మీకు, నాకు, ఈ సృష్టికి, దేవతలకు ఆధారంగా ఒక బ్రహ్మం ఉంది. ఆ బ్రహ్మం అంతటా వ్యాపించి ఉంది, మన హృదయంలోను ఉంది. ఆ బ్రహ్మం గురించి వేదాలలో ఏమని చెప్పారు అంటే అది శాంతిగా ఉంటుంది, ఆనందంగా ఉంటుంది, జ్ఞానంగా ఉంటుంది, దేహముతోటి, మనస్సుతోటి, ఈ ప్రకృతితోటి సంబంధం లేకుండా, జన్మపరంపరలతో సంబంధం లేకుండా స్వతంత్రమైన ఉనికి కలిగి ఉంటుంది. ఆ బ్రాహ్మీస్థితిని పొందటంకోసమే ఈ సత్సంగ సమావేశాలు.

ఆచార్యులవారు శాస్త్రపండితుడు, వేదపండితుడు కూడా. సంస్కృతభాషను ఎటుమళ్ళించాలంటే అటు మళ్ళించగలడు. సంస్కృతం చాలా సరళంగా వ్రాసాడు. సంస్కృతం సరిగా రాని వాళ్ళకు కూడా పదిసార్లు చదివితే ఆచార్యులవారి సంస్కృతం అర్థమవుతుంది. ఆచార్యులవారి కవిత్వం గంగాప్రవాహం. ఇన్ని విషయాలు ఒకే మనిషిలో ఉండటం కష్టం. ఆచార్యులవారికి కాశీ అంటే పరమప్రీతి. ఆయన దేశం అంతా తిరిగినా ఆయనకు ఎప్పుడు గుర్తుకు వస్తే అప్పుడు కాశీ వెళ్ళి మధ్యమధ్యలో చూసివచ్చేవారు. కాశీ క్షేత్రం అంటే ఆయనకు హృదయంతో సమానము. కాశీ అంటే ప్రకాశం. మన భారతదేశంలో కాశీతో సమానమైన క్షేత్రం లేదు. కాశీవిశ్వనాధుడిని చూసినా, గంగానదిని చూసినా ఆయన చాలా పొంగిపోయేవారు. ఆచార్యులవారు పరమవైరాగ్య పురుషుడు. వారి వైరాగ్యం ఎటువంటిది అంటే పూర్ణానది ఒడ్డున సన్యాసానికి తల్లి పర్మిషన్ ఇస్తే మరల ఇంటికి వెళ్ళకుండా ఆ నది దగ్గర నుండే కాలడి విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. అప్పుడు తల్లి ఏమని చెప్పింది అంటే నువ్వు ఒక్కడివే నాకు కుమారుడవు. నువ్వు మహాజ్ఞానివి అయినా, నువ్వు పరమాచార్యుడవు అని లోకం అంతా చెప్పకొన్నా కానీ నీ శరీరం మటుకు నాదే అంటే నీ శరీరం నా గర్భంలో నుండి బయటకు వచ్చింది. అందుచేత నా శరీరం శవం అయినప్పుడు నీ చేత్తోటి దహన సంస్కారం చెయ్యాలి, అంతకంటే నువ్వు ఏమీ చేయనక్కరలేదు అని తల్లి చెపితే ఆ మాట పోషించుకొంటాను అని చెప్పి ఆచార్యులవారు అక్కడనుండి వెళ్ళిపోయారు.

కాలడి విడిచిపెట్టిన తరువాత ఆచార్యులవారు గోవిందభగవత్పాదుడి దగ్గర కొన్ని విద్యలు నేర్చుకొన్నాడు. కృష్ణుడు ఉజ్జయినిలో నేర్చుకున్నాడు, రాముడు వశిష్ఠుడి దగ్గర విద్యలు నేర్చుకొన్నాడు. ఏదో సాంప్రదాయాన్ని పోషించటానికి అలా నేర్చుకొన్నారు. గోవింద భగవత్పాదుడు

శరీరం విడిచిపెట్టేముందు ఆచార్యులవారితో నువ్వు కాశీ వెళ్ళు, అక్కడ మహాపండితులు ఉన్నారు, నీ అద్వైతసిద్ధాంతాన్ని అక్కడ ఉన్న పండితులు అంగీకరించాలి అందుచేత కాశీ వెళ్ళమని సలహా చెప్పి ఆయన శరీరం విడిచిపెట్టారు. భాష్యగ్రంథాలు వ్రాయమని కూడా ఆయనే చెప్పారు. కాశీ పేరు వారణాసి. వారణాసి అంటే కాశీలో ఒక ప్రక్క నుండి వరుణానది, ఒక ప్రక్కనుండి అసి నది రెండూ వచ్చి గంగానదిలో కలుస్తాయి. ఆ రెండు నదుల మధ్యన ఉన్న ప్రదేశాన్ని వారణాసి అని పిలుస్తారు. వరుణ, అసి నదుల మధ్య ఉన్న ప్రదేశం వారణాసి. అది మహా స్మశానం. చాలా రేవులలో ఎప్పుడూ శవాలు కాలుతూ ఉంటాయి. ఆచార్యులవారు నర్మదానది సమీపంలో ఉన్నప్పుడు వరదలు వచ్చి ఓంకారేశ్వరుడి గుడి, గోవిందభగవత్‌పాదులు ఉన్న కుటీరాన్ని ముంచినప్పుడు ఆయన కమండలంతోటి మొత్తం ఆ వరదనీటినంతా పట్టాడు అని చెపుతారు. ఒకవేళ అలా జరిగినా దానికి ఆశ్చర్యం ఏమీ లేదు.

ఆచార్యులవారి నివాసం ప్రక్కనే కృష్ణుడి గుడి ఉంది. ఆ కృష్ణుడిని ఆర్యాంబ జీవితం పొడుగునా ఆరాధించింది. ఇప్పటికి కూడా ఆ గుడి ఉంది. అక్కడికి వెళ్ళిన వారు చూడవచ్చు. ఆ గుడి శంకరాచార్యుల వారి కుటుంబానిది. ఈయనకు పూర్వీకుల దగ్గరనుండి వచ్చిన ఆస్థిని ఆ గుడిని ఎవరైతే పోషిస్తున్నారో, ఎవరైతే అక్కడ అర్చనలు చేస్తున్నారో వాళ్ళకు ఈ ఆస్థిని సంక్రమింపచేసారు. ఆయన శృంగేరీలో ఉన్నప్పుడు తల్లిగారు మరణిస్తున్నారు అని వార్త వచ్చింది. ఆయన చేత్తో తల్లిగారిని దహనం చేసారు. సన్యాసి దహనం చేయకూడదు, మేము చేస్తాము అని కుటుంబంవాళ్ళు పేచీలు పెట్టారు. అప్పుడు ఆచార్యులవారు ఏమన్నారు అంటే నాచేత్తోటి దహనం చేస్తాను అని తల్లికి నేను మాట ఇచ్చాను, ఆ మాటను పోషించుకోవటంకోసం నేనే దహనసంస్కారం చేస్తాను అంటే అయితే నీకు మేము శవాన్ని మోయటానికి సహకరించము, నిప్పు ఇవ్వము అని చెప్పారు. అప్పుడు ఆయనే శవాన్ని మోసుకొనివెళ్ళి ఆయన చేత్తోటి నిప్పును సృష్టించి అక్కడ తల్లిని దహనం చేసి ఒక రాతి స్థంభం గుర్తుకోసం అక్కడపాతారు. ఇప్పటికి కూడా అక్కడ రాతిస్థంభం ఉంది. దానిని ఆర్యాంబ సమాధి అంటారు. ఆయనే తల్లికి అన్ని కార్యక్రమాలు చేసేసి కాలడి విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆయన జీవితంలో మరల కాలడి రాలేదు.

ఆచార్యులవారి జీవితంలో ఏ ప్రదేశం తిరిగినా, ఎంతమందితో పరిచయాలు ఉన్నా మానసికంగా ఎక్కడా, ఎవరినీ అంటుకోలేదు. భారతదేశం అంతా కూడా సంచారం చేసేటప్పుడు ధర్మప్రచారం కోసం శృంగేరి, పూరీజగన్నాథం, బదరీ, ద్వారకలలో నాలుగు

మఠాలు స్థాపించారు. ఆయనకు సురేశ్వరుడు, పద్మపాదుడు, తోటకాచార్యుడు, హస్తామలకుడు అని నలుగురు శిష్యులు ఉండేవారు. ఆయన చెప్పింది ప్రచారం చేయటానికి ఈ నలుగురిని నాలుగు పీఠాలకు అధిపతుల్ని చేసారు. వారికి ఆచార్యులవారు చెప్పింది ఏమిటి అంటే మీరు ధర్మాన్ని ప్రచారం చేయండి. సమాజంలో అందరికీ జ్ఞానోదయం కలుగజెయ్యాలి. కేవలం డబ్బు వల్లనే మనుషులు సుఖపడరు. ధర్మశాస్త్రాన్ని విడిచిపెట్టి అర్థశాస్త్రాన్ని పట్టుకొంటే మీకు దుఃఖం వస్తుంది, అశాంతి వస్తుంది, రాబోయే జన్మలు నీచ జన్మలు వస్తాయి. కుటుంబ పోషణకు ధనం అవసరమే. ఉండటానికి ఇల్లు, తినటానికి తిండి, కట్టుకోవటానికి బట్ట అవసరం. కొంతధనం లేకుండా ఈ అవసరాలు తీరవు. మనకు ధనం అవసరమే కాని ధర్మాన్ని విడిచిపెట్టి ధనాన్ని పట్టుకోకూడదు అని చెప్పారు. ప్రజలు సుఖపడటానికి, వారి నైతికవిలువలు పెంచటానికి, వారికి ఆత్మనిష్ఠ కలుగజేయటానికి ధర్మాన్ని ప్రచారం చేయండి అని పీఠాధిపతులతో చెపుతూ మీరు ఎప్పుడూ సముద్రం దాటి మటుకు ఇతరదేశాలకు వెళ్లవద్దు అని ఆచార్యులవారు చెప్పారు. ఆచార్యులవారు అసలు పీఠాలు ఎందుకు పెట్టారు అంటే స్కూళ్ళు కట్టమని, కాలేజీలు కట్టమని, హాస్పటల్స్ కట్టమని కాదు. అవి కట్టేవారు వేరుగా ఉంటారు, ఎవరు చేసే పని వారు చేస్తారు. ఇక్కడ సన్యాసుల పని ఏమిటి అంటే మీరు సమాజంలో పర్యటించి జ్ఞానాన్ని, ధర్మాన్ని బోధించి వారిని జ్ఞానవంతులను చేసి, సమాజం ఆరోగ్యంగా ఉండేటట్లు, సమాజంలో అరాచకత్వం లేకుండా అందరూ శాంతిగా ఉండేటట్లు భోధించమని పీఠాధిపతులను ఏర్పాటు చేసారు.

మా కుటుంబం ఆర్థికంగా పచ్చగానే ఉంది కాని శాంతి లేదండి, శాంతి ఎలా వస్తుంది అని ఇంతకు ముందు ఎవరో అడిగారు. బయట పరిస్థితులు శరీరానికి కంఫర్టు ఇస్తాయి కాని శాంతిని ఇవ్వలేవు. మీరు ఏసి గదిలో ఉన్నంతమాత్రంచేత నిద్ర బాగాపడుతుందని చెప్పలేము. సమాజం యొక్క విలువలు పోషించుకోవటంకోసం ఆచార్యులవారు ఆయన గ్రంథాలలో నైతికవిలువలతో పాటు ఫిలాసఫీ కూడా ఎక్కువగా చెప్పారు. ధర్మం, అర్థం, కామం, మోక్షం, మన శాస్త్రాలలో వీటిని పురుషార్థాలు అంటారు. ధర్మశాస్త్రానికి విరుద్ధంగా మనం అర్థశాస్త్రంలో పడితే మనం పతనమైపోతాము. మనకు డబ్బు అవసరం కదా అని అర్థశాస్త్రం కోసం ధర్మశాస్త్రాన్ని విడిచిపెట్టవద్దు. మనం అందరం మహాత్ములం కాదు, ఋషులం కాదు. మనందరకు ఇంద్రియాలు ఉన్నాయి కాని ఇంద్రియనిగ్రహం లేదు కదా మరి అప్పుడు దానికి కామం అవసరం. అందుచేత నీకు ఇంద్రియనిగ్రహం పూర్తిగా వచ్చేవరకు

ధర్మశాస్త్రాన్ని విడిచిపెట్టకు. తరువాత మోక్షం అంటే అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, దేహగతమైన నేనులోనుండి విడుదలపొందటమే మోక్షం. మోక్షం పొందటానికి మన పెద్దలు అనేకమెట్లు కట్టుకొంటూ వచ్చారు. మోక్షం పొందటమే మన జీవిత గమ్యం.

మంచి కర్మలు చేసేవాళ్ళు ఉన్నారు. ఇప్పుడు పబ్లిసిటీ రాకపోతే ఎవరూ ఏ మంచి పనీ చేయటంలేదు. నువ్వు పబ్లిసిటీ కోసం పనిచేస్తే నీకు పబ్లిసిటీ రావచ్చుకాని చిత్తశుద్ధి రాదు. ప్రపంచంలో ఏమతస్థుడికి అయినా, ఏకులస్థుడికి అయినా ఇంతవరకూ చిత్తశుద్ధి లేనివాడికి ఎవడికీ మోక్షం రాలేదు. చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మనం మోక్షాన్ని పొందాలి. ఆచార్యులవారు జీవితం పొడుగునా కర్తలేనికర్మ చేసారు. మీరు పబ్లిసిటీకోసం ఏ పనులు చేయవద్దు. పబ్లిసిటీకోసం పనులు చేస్తే ఈ లోకంలో మీరు గౌరవాలు సంపాదించవచ్చు కాని మరణానంతరజీవితం మీకు నరకప్రాయమేకాని ఏమీ ఉండదు. మీరు కర్తలేని కర్మ చేస్తే, నిష్కామంగా చేస్తే మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి లేకుండా నువ్వు బ్రాహ్మీస్థితిని పొందలేవు, నువ్వు ఎవరిగా ఉన్నావో దాని తాలుక అనుభవం కూడా నీకు రాదు. అందుచేత మీరు మాట్లాడేమాట, మీరు చేసేపని, మీకు వచ్చే ఆలోచన మీ చిత్తశుద్ధిని పెంచాలి. మీరు సత్కర్మని కర్తృత్వం లేకుండా చేస్తే మీకు ఇంద్రియ నిగ్రహం వస్తుంది, మనోనిగ్రహం వస్తుంది. పునాది లేకుండా ఇల్లు కడితే ఎలా కూలిపోతుందో, ఇంద్రియనిగ్రహం మనోనిగ్రహం లేకుండా నువ్వు స్వరూపజ్ఞానానికి ప్రయత్నం చేసినా అలా కూలిపోతావు.

ఆచార్యులవారు నలుగురు శిష్యులకు ఏమని చెప్పారు అంటే సామాన్యమానవుడు ఏ పని చేసినా లోకం చూడదు. చొక్కా నిండా మచ్చలు ఉంటే వాడిని ఎవరూ పట్టించుకోరు. ఒక తెల్లబట్టమీద చిన్నమచ్చ ఉంటే అందరికీ కనిపిస్తూ ఉంటుంది. ఈ ఆచార్యుడు ఎలా ఉన్నాడు అని లోకంలో చాలామంది మీ వంక చూస్తున్నారు. అందుచేత మీరు జీవితంలో ఆదర్శవంతంగా ఉండాలి. మేము బాగానే ఉన్నాము అని మీ అంతట మీరు అనుకోవటం కాదు. ఇతరులకు కూడా మీరు బాగానే జీవిస్తున్నారు అనే భావన కలగాలి ఎందుచేతనంటే మీరు ఆచార్యస్థానంలో ఉన్నారు. ఆచార్యుడు అంటే శిష్యుడికి పాఠం అర్థమయ్యేలాగ చెప్పటమే కాకుండా శాస్త్రంయందు శ్రద్ధ కలుగజెయ్యాలి. శాస్త్రంలో చెప్పినట్లుగా మనం జీవించాలి. ఒక ఇంట్లో యజమాని పెత్తనం చెయ్యకుండా ఇంట్లో ఉన్న నౌకరు, పనిమనిషి పెత్తనం చేస్తే ఆ ఇంటి పరిస్థితి ఎలాగ ఉంటుందో మీరు శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకోకుండా జీవిస్తూ ఉంటే మీ జీవితాలు కూడా అలాగే ఉంటాయి. రామాయణంలో గొడవ అదేకదా. దశరథుడి

పెత్తనం పోయింది, మంధర పెత్తనం వచ్చింది.  చివరికి దాని పరిణామం ఎలా ఉందో మన జీవితాలు కూడా అంతే.  భగవంతుడు మనకు శాస్త్రాన్ని ఇచ్చాడు.  శాస్త్రాన్ని ఎందుకు ఇచ్చాడు అంటే అది తాత్కాలికంగా మీకు చేదుగా ఉన్నా, శాస్త్రంలో చెప్పినట్లుగా మీరు జీవిస్తూ ఉంటే జీవితగమ్యమైన మోక్షాన్ని పొందుతారు.  శాస్త్రానికి అనుగుణంగా జీవించకపోతే వాడు సంసారసముద్రంలో నుండి బయటకు రాలేడు, కోటి జన్మలు ఎత్తినా ఆ సముద్రంలోనే ఉంటాడు.  వాడు ఒడ్డుకు చేరుకొంటాడా లేదా అనేది కాదు అసలు వాడికి ఒడ్డే కనబడదు. అందుచేత మీరు ఏదో ఎల్లమ్మ అలాచెప్పింది, పుల్లమ్మ ఇలాచెప్పింది అని కాకుండా శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని జీవించండి.  ఎవరో అలా జీవించారు మేము ఎందుకు జీవించకూడదు అని ఇలా మనుషులను ఎవరినీ అనుకరించవద్దు.  మీరు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకోండి.  అందుచేత భగవంతుడు చెప్పిన మాటలు వినకుండా, ఆయన చెప్పినది చెయ్యకుండా ఆ నాయకుడు అలా చెప్పాడు, ఈ నాయకుడు ఇలా చెప్పాడు అని లోకుల మాటలు పుచ్చుకొని, వారి మాటల ప్రకారం జీవిస్తే మీకు పతనం తప్పదు.

చంద్రుడు మనకు చల్లదనాన్ని ఇస్తున్నాడు.  ఇంతమందికి నేను చల్లదనాన్ని ఇస్తున్నాను అని ఆయన అనుకోవటం లేదు, మన దగ్గరనుండి ప్రతిఫలం ఆశించటంలేదు.  మీ యొక్క జీవితం కూడా అలాగ ఉండాలి.  ప్రజలు మీకు ఏదైనా ఇస్తే అది మీ పొట్టకు, బట్టకు సరిపెట్టుకోండి.  మీ అవసరాలకు మించి మీ దగ్గర ధనం ఉంటే మీ మనస్సులు మైలపడతాయి, మీరు స్వరూపానికి దూరమవుతారు.  భగవద్గీతను అధ్యయనం చేయండి. విష్ణుసహస్రనామాలు పారాయణ చెయ్యండి.  మహావిష్ణువు యొక్క రూపాన్ని ధ్యానం చేసుకోండి.  అంటే రాముడినికాని, కృష్ణుడినిగాని, శివుడినికాని ఏదో నీ ఇష్టదైవాన్ని ధ్యానం చేసుకోండి.  మిమ్మల్నే మేము ధ్యానం చేస్తున్నాము అని కొంతమంది అంటున్నారు.  మమ్మల్ని ధ్యానం చేయటం ఏమిటి?  మేము దేవతాస్వరూపలంకాదుకదా అంటే అది వేరే విషయం. మాకు శాంతి కావాలి, మిమ్మల్ని ధ్యానం చెయ్యటం వలన మాకు శాంతి వస్తోంది కాబట్టి చేస్తున్నాము అని చెపుతున్నారు.  మీకు ఎవరిని స్మరిస్తూ ఉంటే శాంతి కలుగుతోందో, కాంతి కలుగుతోందో వారిని ధ్యానం చేసుకోవచ్చు.  సత్పురుషులతో సహవాసం చెయ్యండి. సత్పురుషులతో సహవాసం వలన మీకు ముముక్షత్వం కలుగుతుంది.  డబ్బు సంపాదన కోసం మీరు సముద్రాలు దాటి ఇతర దేశాలకు వెళుతున్నారు కదా అలాగే సత్పురుషుల సహవాసం కోసం అవసరమైతే భూమి యొక్క అంచులదాకా ప్రయాణం చేయండి.  డబ్బు

అనేది తాత్కాలికం. ఒకవేళ నువ్వు ఎంత డబ్బు సంపాదించినా మరణానంతరం ఇంటి దగ్గర ఉన్న గుండుసూదినికూడా నువ్వు పట్టుకెళ్లలేవు. 12వరోజు తరువాత ఇంటి దగ్గర నిన్ను స్మరించేవాళ్లు ఒక్కరు ఉండరు. ఏమండీ మీ తండ్రిగారు మీకోసం బాగా సంపాదించారు అంటే డబ్బు సంపాదించటం అలవాటు కాబట్టి సంపాదించుకొన్నాడు. మమ్మల్ని ఉద్ధరించటానికి సంపాదించాడు అని చెపుతారు ఏమిటి? వాడికి డబ్బు అంటే ఇష్టం కాబట్టి సంపాదించుకొన్నాడు, కూడా పట్టుకొని వెళ్లటానికి అవకాశం లేదు కాబట్టి మాకు విడిచిపెట్టాడుకాని కూడా తీసుకొని వెళ్లటానికి అవకాశం ఉంటే మాకు ఒకపైసా కూడా ఇవ్వకుండా అంతా మూటకట్టుకొనిపోయేవాడు అని ఇలా చెప్పేవారు కూడా ఉన్నారు. సజ్జనసాంగత్యం సహజమైన గాలి లాంటిది. సజ్జనసాంగత్యం వలన ఎక్కువగా బాగుపడే అవకాశాలు ఉన్నాయి.

మీలో ఎవరైనా ధనవంతుడు ఉంటే రెండు రకాలు వారికి సహాయం చెయ్యటం మంచిది అని చెప్పారు. 1. దారిద్ర్యంతో బాధపడేవారికి అంటే తిండికి, బట్టకు ఇబ్బంది పడేవారికి, 2. కొంతమంది శరీరాలకు అవయవాలు సరిగా ఉండవు, అవయవాల లోపం వలన వారికి పనిచేసే శక్తి ఉండదు. అటువంటి వారికి సహాయ సహకారాలు అందించండి. అది పబ్లిసిటీకోసం చెయ్యవద్దు. మీరు బాగుపడటంకోసం చెయ్యండి. అర్థం అనర్థం అన్నారు ఆచార్యులవారు. మీ అవసరాలకు మించిన డబ్బు మీ దగ్గర ఉంటే అది అనర్థాలు తీసుకొని వస్తుంది. అంటే ధనం వలన ఇంటిలో కూడా పేచీలు వస్తాయి. ఇక్కడ గృహస్థులనీ, సన్యాసులనీ ఏమీలేదు మీకు అవసరాలకు మించి ధనం అధికంగా కనుక ఉంటే దాని వలన కొంత అశాంతి రావచ్చు. డబ్బు సంపాదించటం కంటే దానిని దాచిపెట్టటంకష్టం, దానిని సద్వినియోగం చేయటం అంతకన్నా ఎక్కువ కష్టం. గోవిందం, భజగోవిందం. ఒరే బుద్ధిలేని వాడా గోవిందుడిని భజించుకో. ఆయన రూపాన్ని ధ్యానం చేసుకో. చావువచ్చి నీ శరీరం మీద పడినప్పుడు నిన్ను రక్షించేవాడు గోవిందుడు తప్పించి ఇంక ఎవడూ లేడు. మరణానంతరం నీకూడా ప్రయాణం చేసేవాడు, నిన్ను తన హృదయంలోనికి తీసుకొనేవాడు గోవిందుడు మాత్రమే, ఆయన తప్పించి నీకు రక్షకుడు ఎవడూ లేడు. నీ చుట్టాలు, స్నేహితులు ఎవరూ నీకూడా రారు. రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అనుకొంటున్నావుకాని చావు దగ్గరకు వస్తోంది అనే గుర్తింపు ఎవడికీ లేదు. మా రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అంటారు ఎక్కడికి వెళ్లిపోతున్నాయి అంటే చావు దగ్గరకు వెళ్లిపోతున్నాయి, చివరకు వచ్చేటప్పటికి

చనిపోవటమే కదా! నువ్వు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎంత పండితుడవు అయినా ఈ పుస్తకాలు నిన్ను రక్షించవు, నిన్ను రక్షించేవాడు భగవంతుడు ఒక్కడే అందుచేత భగవంతుడి యందు భక్తి కలిగి ఉండు, ఆయన పాదాలను ఆశ్రయించు.

నువ్వు సాధనచేసి నీలో ఉన్న బలహీనతలను పోగొట్టుకోవాలి. ఈశ్వరుడి యొక్క స్వరూపం పొందకుండా మీలోపల ఉన్న ఏ పాపచింతన అడ్డువస్తోందో, మనలో ఉన్న స్వార్థం తాలూక దుంప అడ్డువస్తోందో చూసుకోవాలి. ఈ పాపం తాలూక దుంప, స్వార్థం తాలూక దుంప ఎండిపోయిందా, ఇంకా పచ్చిగానే ఉందా అని ఎవరిమటుకు వారు పరీక్ష చేసుకొని చూసుకోవాలి. నీలోపల ఉన్న పాపపు తాలుక దుంప ఎండిపోకపోతే నీకు శాంతచిత్తం కలుగదు. నీలోపల బలహీనతలు ఉన్నప్పుడు, ఇంద్రియాలకు విషయాలపట్ల ఆకర్షణ ఎక్కువగా ఉన్నప్పుడు, మనస్సుకు చాపల్యం ఎక్కువగా ఉన్నప్పుడు ఇంద్రియాలు కాని, మనస్సుకాని శాంతిగా ఉండనివ్వవు. ఇంద్రియనిగ్రహంకోసం, మనోనిగ్రహంకోసం నువ్వు ఈశ్వరుని పాదాలను ఆశ్రయించాలి. ఈశ్వరుడి యొక్క రూపాన్ని ధ్యానించుకో, ఆయన నామాన్ని స్మరించుకో. మనకు తల్లి, తండ్రి, గురువు కూడా ఈశ్వరుడే. మరణానంతరం మన కూడా వచ్చేవాడు, మన స్నేహితుడు, బంధువు ఈశ్వరుడే. అన్నీ ఆయనే అంటే సర్వస్వం ఆయనే కాబట్టి ఆయనకు శరణాగతిచెయ్యి.

నీకు భక్తి ఉంటే, నీ భక్తిని కేవలం కోరికలకు పరిమితం చేయవద్దు. మోక్షంపట్ల అపేక్ష సంపాదించు. నువ్వు ఇంటి దగ్గర పనులు చేసుకొంటూ ఉన్నా నీ మనస్సు మటుకు మోక్షం పట్ల అపేక్షకు అంకితం అయి ఉండాలి. ఒకవేళ మోక్షాన్ని పొందటంలేటు అయినా నువ్వు సహనాన్ని కోల్పోకూడదు. మీరు సహనం ఎప్పుడైతే కోల్పోయారో అప్పుడు లక్ష్యంవైపుకు మీ ప్రయాణం ఆగిపోతుంది. మీరు ముముక్షత్వం కలిగి ఉండాలి. మోక్షాన్ని పొందటానికి అన్ని మార్గాలు మంచివేకాని ఆచార్యులవారు జ్ఞానమార్గం ఉత్తమోత్తమం అని చెప్పారు. మీరు స్వార్థం లేకుండా పనిచేస్తే మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి జ్ఞానానికి దారిచూపిస్తుంది. అంటే జ్ఞానం పొందటానికి కర్మమార్గం సహకరిస్తుంది. అయితే కర్మను మీ ఇష్టం వచ్చినట్లు చేయకూడదు, శాస్త్రంలో చెప్పినట్లుగా చెయ్యాలి. మీరు కోరికతో చేసినా, కోరిక లేకుండా చేసినా వచ్చే ఫలితం వస్తుంది. పని ఫలితాన్ని ఇవ్వకుండా ఉండదు. కాని మనం ఫలితాన్ని ఆశించి చేయకూడదు. ఆశించి చేస్తే మీకు చిత్తశుద్ధి కలుగదు. అంటే మీరు చేసే కర్మ ఎలా ఉండాలి అంటే మీరు స్వరూపజ్ఞానం పొందటానికి, ఆత్మజ్ఞానం పొందటానికి, ముగింపు లేని

సుఖాన్ని పొందటానికి అనుగుణంగా మీరు చేసిన కర్మ ఉండాలి.

మన పూర్వీకులు ఆచారాలు ఎందుకు పెట్టారు అంటే అవి కేవలం శారీరక ఆరోగ్యానికే కాదు, శుభ్రత కోసమే కాదు, ఆచారంవల్ల ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తుంది. ఆచారాలవల్ల ధర్మాన్ని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ఆచారం అంటే కేవలం మడి అని కాదు. మనమాట శుద్ధిగా ఉండాలి, మనం చేసే పని శుద్ధిగా ఉండాలి. ఇతరులతో మాట్లాడేటప్పడు కపటం లేకుండా మాట్లాడాలి. ఇప్పడు గుమ్మం దాటి ఎక్కడికి వెళ్ళినా మోసమే. మనిషికి తెలివితేటలు ఎందుకు అంటే ఇతరులను మోసం చేయటానికి కాదు, ఇతరులు చేసే మోసంలో మనం పడకుండా ఉండటానికి తెలివి అవసరం. భవిష్యత్‌లో ఈ కలి ప్రభావంలో ధనం లేనివాడు బతకగలడు కాని తెలివి లేనివాడు బతకటం చాలా కష్టం. అందుచేత వివేకం అవసరం. అన్నం ఉడికేటప్పడు పొయ్యిలో పుల్లలు మండుతూ ఉండాలి. అన్నం ఉడికాక మంట ఆరిపోయినా పరవాలేదు. అలాగే మీ మనస్సు అటు ఇటు తిరుగుతున్నప్పడు, మనస్సుకు శాంతి లేనప్పడు ఈశ్వరుడు మనకు అవసరం. మనం ఈశ్వరుడిని స్మరించుకోవాలి, ఆయనను ధ్యానం చేసుకోవాలి. మీకు స్వరూపజ్ఞానం కలిగాక అంటే మీరు పూర్ణస్థితిని పొందాక ఈశ్వరస్మరణ దానంతట అదే ఆగిపోతుంది. అన్నం ఉడికిన తరువాత పొయ్యిలో మంటతో పనిలేదు అలాగే నీలో ఉన్న పునర్జన్మ కారణమైన సంస్కారాలు, వాసనలు అన్నీ నశించినప్పడు ఈశ్వరస్మరణ నీ దగ్గరనుండి జారిపోతుంది. అప్పడు నీకు జపధ్యానములతో పనిలేదు. నీలోపల ఉన్న సద్వస్తువు నీ చేతికి అందినప్పడు ఇంక బాహ్యంగా నీకు సత్పురుషుల సహవాసం కూడా అవసరం ఉండదు.

ఇప్పడు మనకు దేహము, ఇంద్రియాలు, మనస్సు తెలుస్తున్నాయి. పగలు మనం దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి తాదాత్మ్యం చెందినప్పడే కర్మలు చేస్తాము. రాత్రి నిద్రలో ఉండగా ఎవడూ కర్మచేయడు. ఈ ప్రపంచం చాలా విచిత్రమైనది. మన మనస్సుకు వేరుగా ప్రపంచం లేదు. ఉదయం మనం లేవగానే మనస్సు వచ్చేస్తుంది. మనస్సు రాగానే ప్రపంచం వచ్చేస్తుంది. రాత్రి మనకు నిద్రపట్టినప్పడు మనస్సు అణిగిపోతుంది, అప్పడు ప్రపంచం కూడా అణిగిపోతుంది. అందుచేత ఇప్పడు మనం చూస్తున్న ఈ ప్రపంచం, ఈ కష్టసుఖాలు, స్నేహాలు విరోధాలు మనస్సు ఎంత నిజమో ఇవి కూడా అంతే నిజం. మనస్సు విజృంభించినప్పడు ఇవన్నీ వస్తున్నాయి. మనస్సు అణిగినప్పడు ఇవన్నీ అణిగిపోతున్నాయి. దేహము, ఇంద్రియాలు, మనస్సు ఇవి ఏమీ నిద్రలో పనిచేయవు ఎందుచేతనంటే నిద్రలో

నీవు నీవుగా ఉన్నావు. దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి నీకు తాదాత్మ్యం ఉన్నంత కాలం మనం పనిని విడిచిపెట్టి ఉండలేము, ఏదో పని చేస్తూనే ఉంటాము. గాఢనిద్రలో పని మీ దగ్గరనుండి జారిపోతుంది. ఆ గాఢనిద్రలో ఉన్న స్థితిని నువ్వు జాగ్రదవస్థలో కనుక పొందితే గాఢనిద్రలో నువ్వు పనితో సంబంధం లేకుండా ఎలా ఉన్నావో అలాగే పగలు కూడా నీకు మనస్సు తాలుక, ఇంద్రియాల తాలుక తాదాత్మ్యం నీకు లేనప్పుడు కర్మతో ఉన్న సంబంధం సహజంగానే ఊడిపోతుంది. అంటే కర్మను నువ్వు విడిచిపెట్టనక్కరలేదు. కర్మే నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. కర్మ నిన్ను విడిచిపెట్టాలి కాని నువ్వు కర్మను విడిచిపెట్ట కూడదు. నువ్వు బలవంతంగా కర్మను విడిచిపెడితే కురుపు రేగినట్లు మళ్ళీ రేగుతుంది. కురుపు తగ్గిపోయాక నేచురల్‌గా దానిపైన ఉన్న పెచ్చు ఎలా ఊడిపోతుందో అలాగ నువ్వు పక్వానికి వచ్చినప్పుడు కర్మ ఊడిపోతుంది, అంటే నీకు స్వరూపజ్ఞానం కలిగినప్పుడు కర్మ అలా ఊడిపోతుంది.

కొంతమంది హృదయంలోపలకు వెళ్ళరు. శాస్త్రంలో ఉన్నది ఏదో చిలుకపలుకులు పలికినట్లు చెపుతూ ఉంటారు. రామా అనమంటే చిలుక రామా అంటుంది కాని రామ శబ్దంలో ఉన్న విలువ దానికి తెలియదు. ఈ పుస్తకాలు చదివి చెప్పేవాళ్ళు చాలామంది ఈ బాపతు జనమే. అది శాస్త్రవాసన. దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసనలలో దేహవాసన బలీయమైనది. మేఘాలు ఎక్కువగా ఉన్నప్పుడు సూర్యుడు ఉన్నా మనకు కనబడడు. అలాగే నీ హృదయంలో జ్ఞానసూర్యుడు ప్రకాశిస్తున్నా వాసనలు అనే మేఘాలు, కోరికలు అనే మేఘాలు మిమ్మల్ని కమ్మేసినప్పుడు మీ హృదయంలో ఉన్న జ్ఞానసూర్యుడు మీకు కనబడడు. సూర్యుడికంటే మేఘాలు గొప్పవి కాదు కాని సూర్యుడు మనకు కనబడకుండా చేస్తున్నాయి. అదేవిధంగా నీలో ఉన్న వాసనలు, కోరికలు నీ స్వరూపాన్ని నీకు గోచరించకుండా చేస్తున్నాయి. అందుచేత నువ్వు జ్ఞానం గురించి పెద్దలు చెపుతూ ఉంటే శ్రవణం చెయ్యాలి. అలా శ్రవణం చేయటం వలన ఇంద్రియాలు, మనస్సు శుద్ధి అవుతాయి. అలాగ శ్రవణం చెయ్యగా చెయ్యగా జ్ఞానం సంపాదించాలనే కాంక్ష లోపల ఉదయిస్తుంది. శ్రవణం చేస్తే సరిపోతుందా అని కొంతమంది అంటారు. శ్రవణం చేస్తే మనం ఆచరించగలిగింది ఆచరిస్తాము, ఆచరించలేనిది ఆచరించలేము. ఇటువంటి పనికిరాని మాటలను, బాధ్యతలేని మాటలను భుజాన వేసుకొని తిరగకూడదు. కొంతమంది వారి కుటుంబాన్ని బాధ్యతగా చూసుకొంటారు, ఇతరులకు సలహా చెప్పేటప్పుడు అంత బాధ్యతగా చెప్పరు. అంటే వాళ్ళ

కుటుంబాల విషయం జాగ్రత్తగా చూసుకొని మీకు ఆలోచనలేని సలహాలు చెపుతూ ఉంటారు. అందుచేత ఎవరైనా ఏదైనా చెప్పినప్పడు మీరు వేగిరపడకూడదు. వారు అసలు మీ క్షేమంకోరే చెపుతున్నారా, అహంకారంతో చెపుతున్నారా అనేది చూసుకోవాలి. బాధ్యత లేని మాటలు చెప్పి మీ కొంపలకు నిప్ప పెట్టేవారు ఉంటారు. అందుచేత వివేకం అవసరం.

మనలో రాగద్వేషాలు, అసూయ, గర్వం, లోభిత్వం ఇవన్నీ ఉన్నాయి. ఈ చెడు గుణాలవల్లనే మనకు సంసారం వస్తోంది. భగవంతుడు అసత్యం, సంసారం సత్యం అని మనకు అనిపిస్తోంది అంటే హృదయంలో ఉన్న చైతన్యంలో మేల్కొనే వరకు నిజంకానిది నిజంలాగ మనకు కనిపిస్తుంది. నీ హృదయంలో ఉన్న ప్రకాశం నీకు అందుబాటులోనికి వచ్చేవరకు నువ్వు అనుకొన్నదే నిజం అనిపిస్తుంది కాని ఉన్నది నిజం అనిపించదు, అది సహజం. నువ్వు పారమార్థిక జీవితం ప్రారంభించి పరమాత్మలో ఐక్యమైనప్పడు ఈ సృష్టి అంతా కూడా నీకు స్వప్నంకింద కనిపిస్తుంది, స్టుపిడ్ స్టఫ్‌గా కనిపిస్తుంది. ఇంద్రియాలు చేసేపనులు, మనస్సు చేసే పనులు లోపల ఉన్న చైతన్యానికి ఆపాదించకు. మీలో మంచి పనులు చేసినవారు ఉండవచ్చు, చెడ్డ పనులు చేసినవారు ఉండవచ్చు. కాని వీటికి లోపల ఉన్న చైతన్యానికి ఏమీ సంబంధం లేదు. ఆకాశంలో మేఘాలు తిరుగుతూ ఉంటాయి. ఆకాశంలో మేఘాలు తిరిగినా వాటికి సూర్యుడికి, చంద్రుడికి ఏమీ సంబంధం లేదు. అదేవిధంగా నీ ఇంద్రియాలు చేసే పనులకు, మనస్సు చేసే పనులకు, అహంకారం చేసే పనులకు మీ హృదయంలో ఉన్న పరమాత్మకు ఏమీ సంబంధం లేదు. భగవదనుగ్రహం పొందినవాడికి రూపబుద్ధి, నామబద్ధి పల్చబడిపోతాయి. నీకు స్వరూపజ్ఞానం ఎప్పడైతే కలిగిందో, నీ హృదయంలో ఉన్న సద్వస్తువు ఎప్పడైతే ఉన్నది ఉన్నట్లుగా నీకు అనుభవంలోనికి వచ్చిందో అప్పడు నువ్వు ఆనందస్వరూపుడవు అవుతావు. జ్ఞానస్వరూపుడవు అవుతావు. అప్పడు నువ్వు దేహంగా ఉండవు, మనస్సుగా ఉండవు, చైతన్యంగానే ఉంటావు. మీకు చైతన్యానుభవం ఉంటే మిమ్మల్ని చూసేటప్పటికి మాకు కూడా చైతన్యానుభవం పొందాలి అనిపిస్తుంది.

మీరు ఇతరులకు ఉపకారం చెయ్యకపోవచ్చు. మీకు మీరు అపకారం చేసుకోవద్దు అంటే మనస్సుని విచ్చలవిడిగా విడిచిపెట్టవద్దు. మీరు ఎవరికీ ఏమీ సహాయం చేయనక్కరలేదు. మీకు మీరు అపకారం చేసుకోవద్దు మీరు సుఖంగా ఉండండి అని చెప్పినా అలా ఉండలేకపోతున్నారు కదా! దానికి డిజైర్ కారణం. ఏసు ఏమని చెప్పాడు అంటే మీరు క్రమశిక్షణగా ఉండండి. మీకు జీవితంలో ఏమి కావాలో అన్నీ భగవంతుడు సమకూరుస్తాడు.

మనస్సును గాలికి వదిలేయకండి. మనస్సును నిర్మలంగా ఉంచండి, మనస్సును ఏకాగ్రంగా ఉంచండి. మీరు ఏమీ అడగకుండానే దేవుడు అన్నీ మీకు సమకూరుస్తాడు. ఉన్నదేదో ఉంది. మీకు లేనిది ఏమైనా ఉంటే యెహోవా సమకూరుస్తాడు అని చెప్పాడు.

మీకు ఎవరికైనా కష్టాలు వస్తే కంగారుపడకండి. అవి పోవాలని వాడినీ, వీడినీ ప్రార్థించటం మొదలుపెట్టకండి. అవి మీకు పాఠాలు నేర్పి వెళ్ళిపోతాయి. ఎస్కేపిజం వద్దు, వాటిని బేర్ చెయ్యండి అంటాడు బుద్ధుడు. వాటివల్ల నేర్చుకొనే పాఠాలు ఉంటాయి, వాటి వలన మీ మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం బాగుపడుతుంది. మీ పనులు మీరు చేసుకోండి కాని దేనిలోను అతిగా ఉండకండి. మీకు దుఃఖం వస్తోంది. నాకు దుఃఖం పోగొట్టు అని దేవుడిని ప్రార్థించటంకాదు. ఏ కారణం వలన ఆ దుఃఖం వస్తోందో చూసుకొని ఆ కారణాన్ని కత్తిరించాలి. ఏ కారణం వలన మనకు అశాంతి వస్తోంది, ఏ కారణం వలన మనకు కష్టం వస్తోంది అని చూసుకొని దానిని ఎలా నివారణ చెయ్యాలి అనేది చూసుకోవాలి కాని మీరు ఎక్కడికీ పారిపోవద్దు.

భగవంతుడు అందరి హృదయాలలో సమానంగానే ఉన్నాడు కాని మన దేహాలు రకరకాలుగా ఉన్నాయి, మనస్సులు రకరకాలుగా ఉన్నాయి, ప్రపంచంలో ఉన్న జీవకోటి రకరకాలుగా ఉన్నారు, అందుచేత భగవంతుడు కూడా ఇన్ని రకాలుగా ఉన్నాడా అని అనుకొంటాము కాని ఆయన ఒక రకంగానే ఉన్నాడు. పూసలు వేరుగా ఉన్న లోపల ఉన్న దారం ఒకటిగా ఎలా ఉందో అలాగ ఈ జీవకోటి వేరువేరుగా మీకు కనిపిస్తున్నప్పటికీ లోపల ఉన్న వస్తువు అందరి హృదయాలలో ఒకటిగానే ఉంటుంది. ఆయన అనుగ్రహం ఉంటే మనకు ఇంద్రియనిగ్రహం వస్తుంది, మనోనిగ్రహం వస్తుంది.

ఆచార్యులవారు 32 సంవత్సరాలే భౌతికశరీరంలో ఉన్నారు. వందపార్టీలు కలిసినా చేయలేని పని ఆయన 32 సంవత్సరాల జీవితంలో చేసారు. అది చైతన్యశక్తి. వాళ్ళు దేహంలో ఉన్నా దేహానికి అతీతులు. వాళ్ళు ఒక దేహంలో ఉన్నట్లు మనకు కనిపిస్తుంది కాని వారికి ఆ దేహానికి సంబంధం లేదని వాళ్ళకు తెలుస్తూనే ఉంటుంది. అంటే లోకం కోసం దేహం ధరించి వచ్చారు కాని వాళ్ళకు ఆ దేహంతో పనిలేదు. ఇతరులకోసమే వచ్చారు కాని, వారికి ఈ లోకంలో సొంతపనులు అంటూ ఏమీ లేవు. వారు చేయవలసిన పని ప్రశాంతంగా చేసివెళ్ళిపోయారు. అందుచేత వాళ్ళందరూ మనకు ఆదర్శపురుషులు. అందుచేత మన ఆచార్యులవారిని స్మరించి మీరందరు ఆయన అనుగ్రహాన్ని పొందుతారని నేను నమ్ముతున్నాను.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జూలై | 8 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| జూలై | 18 | శ్రీసాయి సేవా శిబిరం, గౌతమీ ఘాట్, రైతు బజార్ వెనుక, రాజమండ్రి |
| జూలై | 31 | గురు పూర్ణిమ - వివిఎస్ గార్డెన్స్ (శివ కళ్యాణ మండపం) యూత్ క్లబ్ రోడ్డు, వెంకట్రాజు నగర్, చిన అమిరం, భీమవరం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# గురుపూర్ణిమ

ప్రతి సంవత్సరం భగవాన్ శ్రీ వ్యాసమహర్షి జన్మదినమైన ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. వ్యాసుని అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. గురువుకు కృతజ్ఞతను తెలుపుకునే పండుగ గురుపూర్ణిమ. మన సనాతన గురుపరంపరలో వ్యాసుడు ఆద్యునిగా భావింపబడతాడు. అట్లే మన సనాతన ధర్మంలో అనాదిగా గురుశిష్యపరంపర కొనసాగుతూ వస్తోంది. జీవకోటిని అసత్యము నుండి సత్యములోనికి, అజ్ఞానము నుండి జ్ఞానములోనికి, మృత్యువు నుండి అమృతత్త్వము లోనికి మేల్కొలుపుటకు, మహాత్ములు ఆయా కాలాలలో భూమిపై అవతరిస్తూనే ఉంటారు, అట్టి మహాత్ముడే భగవాన్ శ్రీ వ్యాసమహర్షి. వేదరాశిని నాలుగుగా విభజించి, వేదవ్యాసుడిగా ప్రసిద్ధిగాంచాడు. ఉపనిషత్తులు, అష్టాదశపురాణములు, భారతము, భగవద్గీత, భాగవతము, మున్నగు అమూల్యగ్రంథాలను మానవాళికి అందించి మహోపకారం చేసాడు. మహాభారతం వ్యాసుడిచే రచించబడిన అతిపెద్ద కావ్యం. గురువు సర్వవ్యాపి, బ్రహ్మముకన్న వేరుకాదు. గురువు త్రిమూర్తి స్వరూపుడు మరియు మానవ రూపం ధరించిన దేవుడు. గుర్తుచూపేవాడు గురువు. అజ్ఞానమనే చీకటిని పోగొట్టి జ్ఞానమనే వెలుతురులోకి మేల్కొలుపుతాడు గురువు. గురువు అంతర్యామిగా మన స్వరూపంగా ఉండి, బాహ్యంగా ఒక మానవరూపంలో కూడా ఉంటాడు. ప్రతి మనిషిలోను స్వరూపంగా, నిగూఢంగా, సూక్ష్మంగా, ఉన్న ఆత్మతత్త్వాన్ని ఎరుకపరచి అమృతత్త్వంలోకి మేల్కొలిపేవాడే నిజమైన గురువు. ప్రతిమానవుడికి వాస్తవంగా తానెవరో? అనుభవైకవేద్యం అయినప్పుడే అమృతస్థితి కలుగుతుంది, అట్టి స్వరూపానుభవం కలగాలంటే గురువుయొక్క మార్గదర్శకత్వం మరియు అనుగ్రహం అత్యంత కీలకం. గురువు ఎల్లప్పుడూ శిష్యులను తనను మించిన వారు కావాలని కోరుకుంటాడు. గురువు నిర్దేశించిన మార్గమును ఆచరించి మనము గమ్యంలోకి మేల్కొన్నప్పడే గురుఋణం తీరుతుంది. గురువుయొక్క ఆవశ్యకతను మరియు మనము తరించడానికి గుర్వనుగ్రహం అత్యంత కీలకం అన్న సత్యాన్ని గురుపూర్ణిమ గుర్తుచేస్తుంది.

ఓంతత్సత్ (ది॥ 31-07-2015 గురుపూర్ణిమ సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# జీవుడికి - చైతన్యానికీ అనుసంధానకర్త గురువే

జీవలక్షణాలు దుఃఖపూరతమైనవని అందులో ఏసుఖం కలగటంలేదని అది అనవసరమైన ఎన్నో తప్పదార్లు తిప్పతోంది అని గ్రహిస్తాడు. పెద్దల ప్రవచనాలవల్ల అనుభవం అవుతుంది అయింది ఏదో అయింది నేను మహదానందాన్ని జారవిడుచు కొన్నాను. దీన్ని వదిలించుకోవటానికి గురువే సరియైన స్థానం అని గత శాస్త్రాల్లో సిద్ధాంత వాదాల్లోని ఆలోచనా విధానాల్లో, ఆదర్శాలలో పూర్వపు అభిప్రాయాలు నిజం కాదని అలసి గ్రహించి ఆర్తితో గురువును వెదుక్కోవటంలో సఫలమౌతాడు. అప్పుడు లోకసంబంధం పిచ్చిదైనట్లు కనబడుతుంది. గురుప్రేమ సంపూర్ణమైనది. శిష్యుడు గురువులో కరిగిపోవటం ప్రారంభిస్తాడు. లొంగిపోతాడు. తన్ను తాను సమర్పించు కుంటాడు. గురువు 'చావు' అని చెబితే ఒక్క క్షణమైనా ఆలస్యం చెయ్యడు. గురువే ఆతని ఆత్మ, ఆతని ప్రాణం. అప్పుడు ఆతని భక్తి అప్రమేయం. గురువే పరిపూర్ణప్రాణి దానాన్ని తెలుసుకొన్నందువల్ల జీవన రహస్యాన్ని మొత్తానికి మొత్తంగా అవగాహన కలుగుతుంది. మన హృదయాన్ని గట్టిగా తట్టే గురువుకు మనం సర్వస్వాన్ని ధారబోయ గలము. శిష్యుడిని గురువు అంగీకరించిన మరుక్షణమే మనం మరణిస్తాము. అహంకారంలో మనలో గురువు మాత్రమే జీవిస్తాడు. అప్పుడు నెమ్మది నెమ్మదిగా గురువు యొక్క ఉనికి మనలో పెల్లుబుకుతుంది. మనం పరిపూర్ణంగా ఆయనకు అంకిత మైనప్పుడు ఆయనలో దైవత్వాన్ని చూడగలుగుతాము. మనలో అహంకారం యొక్క దుర్గంధం హిమాలయాలకన్నా ఎక్కువని గ్రహిస్తాము. మన తలంపులే దానికి ప్రమాణం. ఎన్నో వికారాలతో, వెకిలిచేష్టలతో, కీర్తికాంక్షలతో ఉన్నామని మనలను తడుముతూ ఉంటాయి. ఆ మాయలో మనలను పడకుండా కాపాడుతాడు. గురువు ఎల్లప్పుడూ ఒక క్షమానిలయం. మనకు రక్షణకవచంగా ఉంటాడు. అసాధారణ మేధా సంపన్నులు గత జన్మల్లో తీవ్రసాధనలో మునిగి పక్వానికి వచ్చిన పవిత్రులు సత్యాన్ని స్వతంత్రంగా అనుసరించగలరు. ఇది చాలా చాలా అరుదు. పుస్తక జన్యజ్ఞానము మేధాశక్తితో సాధింపబడుతుంది. కాని ఆత్మానుభవం, మేధాశక్తికి అతీతమగు ఆత్మవికాసము ఆత్మానుభవములో గురువు శక్తినంతా కేంద్రీకరిస్తాడు. ఆ ప్రక్రియలో మన ధర్మం, మన కర్తవ్యము, ఎట్టిసందర్భంలోనూ నిర్లక్ష్యం చేస్తే ఆయనకు మనం అధికశ్రమను, ఆటంకాలను కలుగజేసిన వారమౌతాము. ఇది సాధకుల కనీస ధర్మం. రామకృష్ణుడు "అమ్మా నేను శరణాగతుడను, దేహసుఖం నాకు అక్కరలేదు, కామినీకాంచనలపై ప్రీతి లేకుండా చెయ్యి నీ పాదపద్మాలయందు శుద్ధభక్తిని, నిష్కామము, అమలము, అహేతుకంబైన భక్తిని అనుగ్రహిచు. నీకంటే నాకు దిక్కు ఎవరున్నారు, సాధనాహీనుడను, భక్తిహీనుడను" అనేవారు. ఆ 'ఆర్తి' మన గురువుపై నిరంతరం తైలధారలా సాగాలి. ఆయన్ని ప్రేమించకుండా ఉండలేని స్థితి రావాలి. అప్పడే సత్యద్వారాలు తెరుచు కుంటాయి. సత్యాన్ని ముఖాముఖి దర్శించగలము. బ్రహ్మానుభవానికి ఆర్తి ముఖ్యం అన్నారు భగవాన్. ఇది సత్యం. సత్యం. సత్యం.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966